కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ధన్యవాదాలు



చార్మినార్: మొహర్రం సంతాప దినాల సందర్భంగా అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా రాష్ట్ర ఉన్నతాధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేసినట్లు బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు. 68 రోజుల పాటు కొనసాగిన షియా ముస్లింల సంతాప దినాలు ముగిసాయన్నారు. సంతాప దినాల సందర్భంగా షియా ముస్లింలకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తమ వినతి మేరకు తగిన ఏర్పాట్లు చేయించారన్నారు.

ఆలయ కానుకల లెక్కింపు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలోని స్వయంభూ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ హుండీని ధర్మకర్తల మండలి సభ్యులు బుధవారం లెక్కించారు. ఆలయ ఈవో శివ రుద్రప్ప పర్యవేక్షణలో మండలి చైర్మన్ ఎ.మహేష్ గౌడ్, సభ్యులు శైలేష్, కె.బబిత, శ్రీధర్, పి.మల్లికార్జున్, బి.వందన, విజయలక్ష్మి, శ్రీధర్‌ల సమక్షంలో కొనసాగిన ఈ లెక్కింపులో రూ.89,194ల నగదు, 44 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నట్లుగా తేలింది. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ జుర్కీ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాలాపూర్ లడ్డూ గ్రహీతకు సన్మానం

చాంద్రాయణగుట్ట: ప్రసిద్ధిగాంచిన బాలాపూర్ లడ్డూను వేలం పాటలో రూ.35 లక్షలు వెచ్చించి దక్కించుకున్న కర్మన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ్‌గౌడ్‌ను బార్కాస్ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ చెన్నయ్యగారి సరిత సన్మానించారు. ఆయన నివాసంలో బుధవారం కలిసి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతోనే ఎంతో మహిమ గల బాలాపూర్ గణనాథుడిని లడ్డూను దక్కించుకునే భాగ్యం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా లడ్డూ ప్రసాదాన్ని ఆమెకు అందజేసి ధన్యవాదాలు తెలిపారు.

గ్రూప్-1 పరీక్షను తిరిగి నిర్వహించాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులతో చెలగాటం ఆడుతోందని శాసన మండలి సభ్యులు దాసోజు శ్రవణ్ ఆరోపించారు. గ్రూప్-1 పరీక్ష విషయంలో హైకోర్టు తీర్పును అమలు చేయాలని బీఆర్‌ఎస్‌వీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... గ్రూప్-1 పరీక్ష రాజకీయాలకు అతీతమైన సమస్యని అన్నారు. హైకోర్టు తీర్పు ప్రకారం గ్రూప్-1 పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 పోస్టులను ప్రభుత్వంలోని కొంత మంది పెద్దలు అమ్ముకున్నారని ఆరోపించారు. గ్రూప్-1 అభ్యర్థులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీకి రూ.50లక్షల వైద్య పరికరాలు



సుల్తాన్‌బజార్: హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సౌజన్యంతో కోఠిలోని ఐఎంఈ ఆస్పత్రికి రూ.50లక్షల విలువైన ఆధునిక పరికరాలను అందజేసింది. వీటిని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కార్యాలయం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీయూష్ మిట్టల్ అధికారికంగా బుధవారం ప్రారంభించారు. ఈ పరికరాలతో చిన్నారులకు కాంక్లియర్ ఇన్‌ప్లాంట్ శస్త్రచికిత్సకు అవసరమైన ఆధునిక నిర్ధారణ, చికిత్స సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు లారింజియల్ (గొంతు) కేన్సర్‌తో బాధపడుతున్న రోగులకు ప్రయోజనం కలుగనుంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. ఆనంద్ ఆచార్య మాట్లాడుతూ..... ఈ ఆధునిక పరికరాలు రోగులకు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఉన్నత స్థాయి కాంక్లియర్ చికిత్సలను అందించగల సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయని తెలిపారు.

ఆలయంలో ఫ్లోరింగ్ పనులు ప్రారంభం

గౌలిపురా: డివిజన్‌లోని శ్రీ కోదండ రామాలయంలో చేపట్టిన రూ.2.50 లక్షల ఎస్ఎస్ ఫ్లోరింగ్ పనులను బుధవారం గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... డివిజన్‌లోని పెండింగ్ పనులను దశలవారీగా పూర్తి చేస్తామన్నారు. గౌలిపురా డివిజన్‌ను ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొంపల్లి భరద్వాజ, బీజేపీ గౌలిపురా డివిజన్ అధ్యక్షుడు సుమన్‌కుమార్ ముదిరాజ్, జిల్లా మీడియా కార్యదర్శి జి.రఘుకాంత్, నాయకులు కె.రాజ్‌కుమార్ ముదిరాజ్, జమాల్‌పూర్ అశోక్, ఎస్.రవి, జి.నర్సింగ్, గౌలిపురా ఏఈ తేజోవంత్ తదితరులు పాల్గొన్నారు.

మిలాద్-ఉన్-నబీకి పాతబస్తీ ముస్తాబు

పలు ప్రాంతాల నుంచి కొనసాగనున్న ర్యాలీలు

- మక్కా మసీదు నుంచి ప్రధాన ర్యాలీ
- ఇతర ప్రాంతాల్లోని ర్యాలీలన్నీ మక్కా మసీదు వైపే..
- కొనసాగనున్న ట్రాఫిక్ ఆంక్షలు

చార్మినార్: పాతబస్తీలో ఈనెల 14న మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. వాస్తవానికి ఈనెల 5న వేడుకలు ఉండడగా.. వినాయక నిమజ్జనోత్సవాలు కూడా ఉండడంతో వేడుకల తేదీ మారింది. సంబంధిత పోలీసు అధికారుల సూచన మేరకు జులూస్ కమిటీ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీతో సమావేశమై ఒక నిర్ణయానికి వచ్చింది. రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు ఉన్నతాధికారులతో సమావేశమై జయంతిని పురస్కరించుకుని 5వ తేదీన మక్కా మసీదుతో పాటు స్థానిక మసీదులలో సామూహిక ప్రార్థనలు చేసిన అనంతరం 14న ర్యాలీ నిర్వహించేందుకు ముందుకు వచ్చారు. అలాగే ఈనెల 5న మహ్మద్ ప్రవక్త 1500 జయంతి వేడుకలను పురస్కరించుకుని వేడుకలు జరిగాయి. అన్నదానాలు సైతం నిర్వహించారు.

☛ ఇక 14న వాడవాడలో జులూస్ నిర్వహించనున్నారు. ఇందుకోసం మర్కజీ మిలాద్-ఉన్-నబీ జులూస్ కమిటీ తగిన ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఇప్పటికే జులూస్ కమిటీ ప్రతినిధులు పాతబస్తీలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలిపారు. వీధులన్నింటినీ ఆకర్షణీయమై రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించనున్నారు. ఇప్పటికే డబీర్‌పురా దర్వాజ తదితర ప్రాంతాల్లో ఆకుపచ్చ విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించారు.

సైలెన్సర్లు తీయొద్దు... ఎక్కువ శబ్దం చేయొద్దు

ముస్లిం యువకులు, చిన్నారులు, మత పెద్దలు ఈ వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొననున్నారు. యువకులు ద్విచక్రవాహనాలపై చక్కర్లు కొడుతూ.. వాహనాలపై జెండాలను ఏర్పాటు చేసుకుని ర్యాలీగా వెళ్లనున్నారు. ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను తీసి ఇతరులకు ఇబ్బందులు కలిగే విధంగా రోడ్లపై చక్కర్లు కొట్టొద్దని మర్కజీ మిలాద్ జులూస్ కమిటీ ప్రతినిధులు కోరారు. జులూస్ కమిటీతో పాటు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ సైతం ముస్లిం మతపెద్దలకు ఇదే విషయాన్ని వివరించారు. చార్మినార్, బహదూర్‌పురా, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట తదితర నియోజకవర్గాల్లోని ముస్లింలు పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించనున్నారు.



పాతబస్తీలో మిలాద్-ఉన్-నబీ వేడుకల సందర్భంగా జెండాలు, ఇతర వస్తువుల విక్రయాలు

పాతబస్తీలో కొనసాగనున్న సందడి..

పాతబస్తీలో ఇతర ప్రాంతాల నుంచి బయలుదేరే సామూహిక ర్యాలీలన్నీ మక్కా మసీదు వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనల అనంతరం చార్మినార్, గుల్జార్‌హౌజ్, పత్తర్‌గట్టి, మదీనా, చెత్తబజార్, పురానీహవేలి, మీరాలంమండి, కోట్లా ఆలిజా, బీబీ బజార్, మొఘల్‌పురా ద్వారా మొఘల్‌పురా వోల్టా హోటల్, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు చేరుకోనున్నాయి. తిరిగి కొంత మంది మళ్లీ యథావిధిగా వచ్చిన దారుల్లోనే చక్కర్లు కొడతారు.

☛ ర్యాలీల సందర్భంగా ఆయా రోడ్లలో దక్షిణ మండలం ట్రాఫిక్ పోలీసులు వాహనాలను దారి మళ్లించనున్నట్లు ముందస్తుగా వెల్లడించారు. ర్యాలీలు కొనసాగిన ప్రధాన రోడ్లలో బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వాహనదారులను దారి మళ్లించనున్నారు. జంగమ్మెట్‌లోని ఖాద్రీ చమాన్ దర్గా నుంచి ప్రధాన ర్యాలీ చార్మినార్-మక్కా మసీదు వైపు కొనసాగనుంది.

త్వరలో జియాగూడ స్లాటర్‌హౌజ్ ఆధునీకరణ



స్లాటర్‌హౌజ్‌లో తనిఖీలు చేస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

జియాగూడ: స్లాటర్‌హౌజ్ ఆధునీకరణ పనులను త్వరలో చేపట్టాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం జియాగూడ స్లాటర్‌హౌస్‌ను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... స్లాటర్‌హౌజ్ ఆధునీకరణ పనులను ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. త్వరలో టెండర్లను పిలిచి పనులు చేపట్టేలన్నారు. ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలని సూచించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాన్ని శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జోనల్‌కమిషనర్ అనురాగ్ జయంతి, చీఫ్ ఇంజినీర్ మెయింటనెన్స్ సహదేవ్ రత్నాకర్, చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ డా. అబ్దుల్ తదితరులు తనిఖీలు చేశారు.

అస్కీ కమిటీ సిఫారసులను సవరించాలి

సుల్తాన్‌బజార్: తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో అస్కీ కమిటీ సిఫారసులను సవరించాలని వైద్య ఉద్యోగుల ఐక్యవేదిక చైర్మన్ ఎంఎస్ మూర్తి, కన్వీనర్ పరబ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కోఠిలోని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, తెలంగాణ వైద్య విధాన పరిత్ కమిషనర్ కార్యాలయాల్లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... పరిషత్‌లోని జిల్లా, ఏరియా వైద్య శాలలు, కమ్యూనిటీ సెంటర్‌లు, మాతా శిశు కేంద్రాలు, డిస్పెన్సరీలలో ఉద్యోగుల సంఖ్య నిర్ధారణ, సెకండరీ హెల్త్ సర్వీసెస్‌గా మార్పు కోసం ఏర్పాటైన అస్కీ (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) కమిటీ సిఫారసులు ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన రేపుతున్నాయని అన్నారు. పారా మెడికల్, నర్సింగ్ స్టాఫ్, ఇతర ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగింపజేసే ఈ సిఫారసులను తక్షణమే అధికారులు సవరించాలన్నారు.



ఎన్‌హెచ్‌ఎం కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న జేఏసీ ప్రతినిధులు

ఈ విషయాలను ఉద్యోగ సంఘాలతో క్షుణ్ణంగా చర్చించి తగు విధంగా సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ నాయకురాలు సుజాత రాథోడ్, జేఏసీ నాయకులు సోమ మల్లయ్య, పాండు, బైరపాక శ్రీనివాస్, ఇందిరా శ్రీలక్ష్మి, తిరుపతి, కరుణాకర్, ప్రభాకర్‌రెడ్డి, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతి ఎన్నిక పట్ల బీజేపీ సంబరాలు

చార్మినార్: భారత ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ఎన్నిక పట్ల బుధవారం బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ జిల్లా అధ్యక్షుడు టి.ఉమామహేందర్,



ఉమామహేందర్‌కు మిఠాయిలు తినిపిస్తున్న వెంకటేష్

ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ప్యారసాని వెంకటేష్, నాయకులు పూస రాజు, ప్రభు పూజారి తదితరులు పాల్గొన్నారు.

వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి ఐలమ్మ



చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సంతోష్‌నగర్: తన కుల వృత్తికే పరిమితం కాకుండా వ్యవసాయం చేస్తానని ఆనాటి భూస్వాములను ఎదురించి వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, దిశాలి చాకలి ఐలమ్మ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ పేర్కొన్నారు. సీపీఎం హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సభను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... తాను పండించిన పంటను శిస్తు రూపంలో కట్టాలన్న దొరల దౌర్జన్యాన్ని కొంగు ముడివేసి తిప్పి కొట్టారన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ఆనాడు సాయుధ పోరాటం ఉవ్వెత్తున లేచిందన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ పార్టీ మహిళా నాయకురాళ్లు ఎం.లక్ష్మమ్మ, పి.శశికళ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.విఠల్, పార్టీ జిల్లా నాయకులు పి.నాగేశ్వర్, ఎం.బాలు, ఎం.మీనా, టి.సత్తయ్య, ఎస్.కిషన్, ఎం.కృష్ణ, స్వరూప, కవిత తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో..

అబిడ్స్: టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని బుధవారం గగన్‌విహార్‌లోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని, నగర అధ్యక్షుడు విక్రమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షులు కేఆర్.రాజ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బాల్‌రాజ్, ముకీమ్ ఖురేషి, రాజు, నయీమ్, సత్యనారాయణ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



గగన్‌విహార్‌లో నివాళులర్పిస్తున్న డా. ఎస్ఎం ముజీబ్ హుస్సేని, విక్రమ్‌కుమార్

షాదీముబారక్ చెక్కుల పంపిణీ



గోల్కొండ: నిరుపేద కుటుంబాల వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. నానల్‌నగర్ డివిజన్ ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో లబ్ధిదారులకు మంజూరైన షాదీ ముబారక్ చెక్కులను బుధవారం ఆయన అందజేశారు. నిరుపేదలు ప్రభుత్వం సంక్షేమ పథకాలకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మొహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, మజీద్, సయ్యద్ రఫత్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

చిరస్మరణీయులు సీఎస్ రావు



సీనియర్ జర్నలిస్టు రెంటాల జయదేవ్‌ను అవార్డుతో సత్కరిస్తున్న సినీనటి వై.విజయ

గన్‌ఫౌండ్రీ: లవకుశ, ఏకవీర వంటి చిత్రాలకు దర్శకత్వం వహించి తెలుగు సినిమా చరిత్రలో రికార్డు సృష్టించిన గొప్ప దర్శకుడు సీఎస్ రావు అని ప్రముఖ నటి వై.విజయ అన్నారు. 70 సినిమాలకు దర్శకత్వం వహించి 50 సంవత్సరాల క్రితమే జాతీయ పురస్కారాలు అందుకున్న ఘనత ఆయనదేనని కొనియాడారు. బుధవారం ఆదర్శ్‌నగర్‌లోని బిర్లా సైన్స్ మ్యూజియంలో నృత్యగాన లయ ట్రస్ట్ (చెన్నై), రోటరీ సాంప్రదాయ (హైదరాబాద్)ల సంయుక్త ఆధ్వర్యంలో దర్శకుడు సీఎస్ రావు శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు డాక్టర్ రెంటాల జయదేవ్‌కు రోటరీ వొకేషనల్ ఎక్సలెన్సీ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో సినీనటి రాజ సులోచన, సీఎస్ రావు అల్లుడు కృష్ణరౌతు, దర్శకుడు శివనాగేశ్వర్ రావు, రచయిత తులసి బాలకృష్ణ, సంగీత దర్శకుడు నరహరి తదితరులు పాల్గొన్నారు.

జల్సాల కోసం బైక్‌ల చోరీ..

ఇద్దరు నిందితుల రిమాండ్

గోల్కొండ: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సంకురు విజయభాస్కర్‌రెడ్డి(23) హకీంపేట్ కుంటలో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన సుంకరి ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఉద్యోగం చేసుకుంటున్నాడు. ఈనెల 8న టోలిచౌకీ సమతకాలనీకి చెందిన మీర్ మెరాజ్ హుస్సేన్ తన యమహా ఆర్ 15 బైక్ చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈనెల 10న టోలిచౌకీ చౌరస్తా వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అదే సమయంలో బైక్ అనుమానస్పందంగా వెళ్తున్న ఇద్దరు యువకులను ఎక్సై రాఘవేంద్ర ఆపి వివరాలు అడిగారు. కాగా వాహనానికి చెందిన ధ్రువపత్రాలు లేకపోవడంతో ఆ యువకులను స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించారు. ఈ బైక్ తాము చోరీ చేశామని బైక్‌ను అమ్మడానికి వెళ్తున్నామని నిందితులు పోలీసుల విచారణలో తెలిపారు. జల్సాల కోసం తాము బైక్‌లు చోరీ చేస్తూ అమ్ముకుంటున్నామని సంకురు విజయభాస్కర్‌రెడ్డి పోలీసుల ముందు తెలిపాడు. దీంతో పాటు నాలుగు యాక్టివాలను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ వివరాలను సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్ బుధవారం ఆజీజ్‌బాగ్‌లోని టోలిచౌకీ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో వెల్లడించారు. ఇదే ప్రెస్‌మీట్‌లో పోగొట్టుకున్న 10 సెల్‌ఫోన్లను పోలీసులకు యజమానులకు అప్పగించారు.

సంచార జాతుల అభ్యున్నతికి కృషి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంచార జాతుల అభివృద్ధికి కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం రవీంద్ర భారతిలో ప్రభుత్వం, సంచార జాతుల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సంచారజాతుల విముక్తి దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సంచార జాతుల అభివృద్ధికి రూ.400 కోట్లను ప్రకటించిందన్నారు. ఇప్పటికే రూ.100 కోట్లను విడుదల చేసిందని తెలిపారు. 100 మంది ఎంబీసీ నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలియజేశారు. సంచార జాతులకు ఇళ్ల నిర్మాణాలు చేయడానికి ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. సంచార జాతులపై సర్వే జరుగుతుందని సర్వే ద్వారా వాస్తవ పరిస్థితులు తెలుస్తాయన్నారు. – రాజకీయంగా సంచారజాతులు నిలదొక్కుకోవాలన్నారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచుకోవాలని సూచించారు. సంచార జాతుల్లో ఇప్పటికే పైకొచ్చిన వారు ఇతరులకు సహకారం అందించి ప్రోత్సహించాలని కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేశామని గుర్తు చేశారు. తాను కూడా వెనుకబడిన తరగతుల నుంచి వచ్చినవాడినేనని గుర్తు చేశారు.

☛ ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడతూ..... సంచార జాతులు ఐక్యంగా ఉండాలని అప్పుడే సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధి, అభ్యున్నతి సాధ్యమవుతుందని అన్నారు. అనంతరం సంచార జాతులపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్‌ముదిరాజ్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, శాసనసభ్యులు ఈ.శంకర్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్, పూర్వ ఐఏఎస్ చిరంజీవులు, బీసీ సంక్షేమశాఖ కమిషనర్ బాలామయదేవి, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు, సంచార జాతుల సంఘం ప్రతినిధులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.



సంచార జాతులపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రంగారెడ్డి జిల్లా జడ్జి కర్ణ కుమార్



సిటీ కోర్టులు: జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కర్ణ కుమార్ అన్నారు. బుధవారం ఎల్‌బీనగర్‌లోని రంగారెడ్డి జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 13న రంగారెడ్డి జిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు కోర్టుకు ముందుకు రాని కేసులు, పెండింగ్ కేసులను రాజీ చేసుకునేందుకు లోక్ అదాలత్ మంచి వేదిక అని పేర్కొన్నారు. లోక్‌అదాలత్‌లో కేసు దాఖలు చేసినప్పుడు కోర్టు రుసుము కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా డబ్బు, సమయం కూడా ఆదా అవుతుందని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, కుటుంబ తగాదా కేసులు, డబ్బు రికవరీ, మోటార్ వెహికల్ యాక్సిడెంట్, చిట్ ఫండ్, ఎలక్ట్రిసిటీ, చెక్కు బౌన్స్ కేసులు, ఇతర రాజీకి వీలున్న కేసులను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపిస్టులు 'డాక్టర్' అని పెట్టుకోవద్దు

ఐఎంఏ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డా. ద్వారకనాథరెడ్డి

సుల్తాన్‌బజార్: రాష్ట్రంలో ఎక్కడ ఫిజియోథెరపిస్టులు డాక్టర్ అనే పదాన్ని తమ పేరు ముందు ఉపయోగించొద్దు భారత ప్రభుత్వ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ ఆదేశాలు జారీ చేసిందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ డి.ద్వారకనాథరెడ్డి, కార్యదర్శి డాక్టర్ వి.అశోక్, ఆర్థిక కార్యదర్శి డాక్టర్ టి.దయాల్ సింగ్ సూచించారు. ఈ మేరకు బుధవారం కోఠిలోని ఐఎంఏ రాష్ట్ర శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఫిజియోథెరపిస్టులు వైద్యులుగా శిక్షణ పొందనందును డాక్టర్ అనే పదాన్ని పేరుకు ముందు పెట్టుకోవద్దని సూచించారు. వారి పాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న డా. ద్వారకనాథరెడ్డి

కేవలం వైద్యుల సిఫారసు మేరకే ఫిజియోథెరపీ అందించాలన్నారు. ఆధునిక వైద్యం, ఆయుర్వేదం, హోమియోపతి, యునాని వైద్యులు మాత్రమే చట్టబద్ధంగా డాక్టర్ పదాన్ని ఉపయోగించడానికి అనుమతి ఉందని తెలిపారు. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే ఇండియన్ మెడికల్ డిగ్రీస్ యాక్ట్ 1916 ప్రకారం నేరంగా పరిగణిస్తారని పేర్కొన్నారు. భారత ప్రభుత్వ నిర్ణయాన్ని ఐఎంఏ తెలంగాణ స్వాగతిస్తోందని తెలిపారు. ఫిజియోథెరపిస్టులు అందరూ ఈ ఆదేశాలను గౌరవించాలని కోరారు.

ఓటర్ లిస్టులో తప్పులుంటే చెప్పండి



అఖిలపక్ష పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న డీసీ సరిత

చార్మినార్: ఓటర్ లిస్టుల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సర్కిల్-9 డిప్యూటీ కమిషనర్ సరిత కోరారు. బుధవారం మొఘల్‌పురాలోని చార్మినార్ డీసీ కార్యాలయంలో అఖిల పక్ష పార్టీల నాయకులతో ఓటర్ లిస్టుపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె నాయకులకు ఓటర్ లిస్టులను అందజేశారు. ఏమైన తప్పొప్పులు ఉంటే తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పత్తర్‌గట్టి మజ్లిస్ కార్పొరేటర్ సోహేల్ ఖాద్రి, చార్మినార్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ, కాంగ్రెస్ సీనియర్ నేత మీర్ హైదర్ అలీ జాఫ్రీ తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథ సత్యనారాయణ ఓ సాహిత్య శిఖరం

ఘనంగా 'జ్ఞానపీఠ పురస్కార గ్రహీతల సాహిత్య సదస్సు'

చార్మినార్: భారతీయ సాహిత్య ఔన్నత్యాన్ని జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు ప్రపంచానికి చాటి చెప్పారని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య వెల్దండ నిత్యానంద రావు అన్నారు. విశ్వనాథ సాహిత్య పీఠం, ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ సంయుక్తంగా నిర్వహించిన 'జ్ఞానపీఠ పురస్కార గ్రహీతల సాహిత్య సదస్సు'లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విశ్వనాథ సత్యనారాయణ, డా.సి.నారాయణరెడ్డి, రావూరి భరద్వాజ సాహిత్య కృషిని కీర్తిస్తూ సదస్సు నిర్వహించటం అరుదైన విషయమని తెలుగు శాఖని అభినందించారు. తెలుగులో విశ్వనాథ సత్యనారాయణ ఒక సాహిత్య శిఖరమని అన్నారు. తెలుగు గేయ సాహిత్య వికాసానికి డా.సి. నారాయణరెడ్డి ఎంతో కృషి చేశారని అన్నారు. పేదరికంలో పుట్టి స్వయంశక్తితో గొప్ప సాహితీ వేత్తగా ఎదిగారని పేర్కొన్నారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు ఎస్.రజని రావూరి భరద్వాజ సాహిత్య కృషిని గురించి వారి జ్ఞానపీఠ పురస్కార నవల పాకుడురాళ్లు గురించి విశ్లేషించారు. డిగ్రీ కాలేజీలో చదువుతున్నప్పటికీ మేరు నగధీరులైన సాహితీమూర్తుల గురించి విద్యార్థులు కూడా పత్ర సమర్పణ చేయడం విశేషమని ప్రశంసించారు.

☛ సదస్సుకు అధ్యక్షత వహించిన కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ మాట్లాడుతూ... పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా తెలుగు సాహిత్య రంగంలో విశేషంగా కృషి చేసిన కవులు, రచయితల గురించి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్న తెలుగు శాఖను అభినందించారు.



విశ్వనాథ సాహిత్య పీఠం అధ్యక్షుడు డా.వెల్చాల కొండల్ రావుకు సన్మానిస్తున్న అతిథులు

☛ సదస్సులో విశిష్ట అతిథిగా పాల్గొన్న డా.వెల్చాల కొండలరావు మాట్లాడుతూ.. తాను స్థాపించిన విశ్వనాథ సాహిత్య పీఠం ద్వారా కవిసమ్రాట్ రచనలను మళ్లీ ముద్రించి పాఠకులకు అందిస్తున్నామని పేర్కొన్నారు.

☛ ఆత్మీయ అతిథిగా విచ్చేసిన విశ్వనాథ మనవడు కళాపూర్ణ శోభనాద్రి మాట్లాడుతూ... చారిత్రాత్మక సిటీ కళాశాలలో విశ్వనాథ సాహిత్యంపై ఒక సాంకేతిక సదస్సు నిర్వహించటం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. సదస్సు కన్వీనర్ శ్రీమతి అవధానం సుజాతని అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విశ్వవిద్యాలయ ఆచార్యుడు లక్ష్మణ చక్రవర్తి, సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు ఆచార్యులు దార్ల వేంకటేశ్వరరావు, డా.పి.కమల సుధారాణి, ఆచార్య కాకునూరు సూర్యనారాయణ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డా.శాంతి, తెలుగు విభాగం అధ్యక్షుడు డా.కోయి కోటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.